ఈఎస్ఐ ప్రాంగణంలో నిత్యాన్నదానం



అన్నదానం చేస్తున్న ఏఎస్ జీఎంకే ట్రస్ట్ ప్రతినిధులు

సనత్‌నగర్: ఈఎస్ఐసీ హాస్పిటల్‌కు నిత్యం వేల సంఖ్యలో జనం వస్తుంటారు. వ్యాధి పీడిత బాధితులతో పాటు వారి వెంట కుటుంబ సభ్యుల రాకతో హాస్పిటల్ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అలా వచ్చిన వారు వైద్య పరీక్షలు, చికిత్సలు చేసుకునే వరకు చాలా సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో రోజంతా ఉండాల్సి వస్తోంది. ఇక ఇన్ పేషెంట్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. డాక్టర్లు డిశ్చార్జి రాసే వరకు అక్కడే ఉండాల్సిందే. అలాంటి పరిస్థితుల్లో రోగితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు ఇక్కడ ఏదైనా భోజనం, టిఫిన్ గానీ చేద్దామంటే దగ్గరలో ఎలాంటి హోటళ్లు లేవు.

అందులోనూ ఈఎస్ఐకు వచ్చేవారు ఎక్కువ శాతం నిరుపేద ప్రజలే. ఈ నేపథ్యంలో దూరంగా ఉన్న హోటళ్లకు వెళ్లి ఏం తింటాంలే అని పస్తులు కూడా ఉంటుంటారు. పగలు అయితే ఏదో ఒక రకంగా కడుపు నింపుకో వచ్చు. రాత్రయితే ఇక్కడ తినడానికి ఏమీ దొరకని పరిస్థితి. అలాంటి వారి ఇబ్బందులను కళ్లారా చూసి ఏఎస్‌జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ ముజీబ్‌ఖాన్ చలించిపోయారు. దీంతో గత ఎనిమిది నెలల నుంచి ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంగణంలోని గౌసియా మసీదు వద్ద ప్రతిరోజూ సాయంత్రం అన్నదానం నిర్వహిస్తున్నారు. హాస్పిటల్‌కు వచ్చే రోగి బంధువులకు, రోగులకు, వృద్ధులు, వికలాంగులకు, అనాథలకు కుల, మతాలకతీతంగా అన్నదానం చేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, వారి సంరక్షకులే కాకుండా చుట్టుపక్కల ఎవరూ ఆకలితో అలమటించకూడదన్న ఆశయంతో ముజీబ్‌ఖాన్ ప్రతిరోజూ సాయంత్రం 7 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు 500 మంది వరకు ఇక్కడ ఆకలి తీర్చుకుంటున్నారు. ప్రతి పేదవాడు కడుపు నిండా అన్న తినడమే ఏఎస్‌జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ ఉద్దేశమని ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ముజీబ్‌ఖాన్, కలిమూసేబ్ తెలిపారు.

దారికాచి.. దాడులు చేస్తున్నాయ్

● హడలెత్తిస్తున్న వీధి కుక్కలు ● భయాందోళనలో ప్రజలు ● దృష్టి సారించని అధికారులు



మొండిబండానగర్‌లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు



లాలాగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో..

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని అనేక ప్రాంతాల్లో వీధి కుక్కలు రోడ్లు, రహదారులపై తిష్ట వేసి దాడులుచేసి గాయపరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. విచ్చలవిడిగా సంచరిస్తూ కనిపించిన వారిపై విచక్షణారహితంగా దాడులు చేస్తుండటంతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే ఆయా ప్రాంతాల వారు జంకుతున్నారు. అటు వైపు నుంచి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులపై సైతం గుంపులు గుంపులుగా దాడులు చేస్తున్నాయి. అడ్డగుట్ట, తుకారాంగేట్, ఎ,బీ,సీ,డీ సెక్షన్లు, వడ్డెరబస్తీ, బోయబస్తీ, మాంగర్‌రోడియా బస్తీస్తీ సాయినగర్, నందనార్‌నగర్, ఇంద్రలక్ష్మీనగర్, నార్త్ లాలాగూడ రైల్వే క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. అంతే కాక ప్రధాన రోడ్లపై గంటల తరబడి తిష్ట వేస్తున్నాయి. పిల్లలను బయటకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పంపిచాల్సి వస్తుందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతుంటే అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను తరలించాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంపులు గుంపులుగా..

విధులు ముగించుకుని రాత్రి సమయాల్లో ఒంటరిగా వచ్చే వారిపైనే వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి గాయపరుస్తున్నాయి. అదే విధంగా తెల్లవారుజామున కూరగాయల మార్కెట్, వివిధ వ్యాపారాలకు వెళ్లే వారిని వెంబడిస్తున్నాయని పొరపాటున వాటికి దొరికితే విచక్షణ రహితంగా గాయపరుస్తున్నాయి. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయని, కొంతమంది వారాల తరబడి చికిత్సలు పొందారని అడ్డగుట్ట వాసులు చెప్పుకొస్తున్నారు.



వాహనదారులను వెంబడిస్తున్న దృశ్యం

ఈ ప్రాంతాల్లోనే తిష్ట..

వీధి కుక్కలు ప్రజలపై అనేక రకాలుగా దాడులకు పాల్పడుతూ గాయపరుస్తుంటే అధికారులు మాత్రం వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుకారాంగేట్‌లోని కమలమ్మ వృద్ధాశ్రమం పక్కనే ఉన్న శ్మశాన వాటిక, మొండి బండానగర్, అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల సమీపంలో, ఏసీఎస్ నగర్ ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో గుంపులు గుంపులుగా తిష్ట వేస్తున్నాయి. శ్మశాన వాటికకు కంపౌండ్ వాల్ లేకపోవడంతో అక్కడే దారి కాచి దాడులకు పాల్పడుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి కుక్కల ఇక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయం..



రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కల సమస్యపై అధికారులు దృష్టి సారించాలి. రాత్రి సమయాల్లో కుక్కల అరుపులకు కంటిపై కునుకు లేకుండా పోతోంది. బయటకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి వీధి కుక్కలను ఇక్కడి నుంచి తరలించేలా చర్యలు చేపట్టాలి.

– విక్కుర్తి పోచయ్య, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 16, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రేపు బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 6న వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరవుతారని నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



అధికారులను సన్మానిస్తున్న రాములు, ప్రమోద్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజనీర్‌గా ఉమాశంకర్, చీఫ్ టౌన్ ప్లానింగ్ అధికారిగా పదవీ బాధ్యతలు తీసుకున్న ఇరువురిని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోర్డు విశ్రాంత అధికారి రాములు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రమోద్, మూర్తి, అష్రాఫ్ తదితరులు బోర్డు కార్యాలయంలో ఉమాశంకర్, ఫణికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడలోని షాబాద్ గూడ కౌసల్‌నాస్ మహల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మైనారిటీ నాయకుడు మహ్మద్ లయాఖ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ మైనారిటీ నాయకులు కరీం, పాషాఖాద్రీ, జాకీర్, గౌస్, జహాంగీర్, బీఆర్‌ఎస్ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించండి



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న నివేదిత

రసూల్‌పురా: వచ్చే పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు నివేదిత పిలుపునిచ్చారు. నియోజకవర్గం బొల్లారం కళాసిగూడలో గురువారం ఆమె పర్యటించారు. మహంకాళి ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి కళాసిగూడలోని సమస్యలపై ఆరా తీశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కంటోన్మెంట్‌లో అర్హులైన పేదలకు పలు సంక్షేమ పథకాలను అందేలా కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. ఈసారి కూడా తాము బీఆర్‌ఎస్‌లోనూ ఉంటూ నివేదితకు అండగా ఉంటామని స్థానికులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షులు రవికుమార్, స్థానికులు రవీందర్, ధీరజ్, సోని, ఉపేందర్, భాగ్యలక్ష్మి రఘు మోహ్న, మురళి యాదవ్, ఉషారాణి, సరళ, వాణి, రవి, నర్సింహా పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

అడ్డగుట్ట: తెలంగాణ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు మెస్ చార్జీలను రూ. 75 నుంచి రూ. 150 కు పెంచాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ సచివాలయంలోని సీఎం, డిప్యూటీ సీఎం, సంక్షేమ శాఖల సలహాదారు, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయాల్లో గురువారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ పొందుతున్న విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందించేందుకు రూ. 75 మాత్రమే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలతో ఉదయం టిఫిన్‌కి రూ. 60 నుంచి రూ. 70 అవుతుందన్నారు. కాబట్టి ప్రభుత్వం ఆలోచించి రూ.75 నుంచి రూ. 150కి పెంచితే విద్యార్థులకు మూడు పూటలు పౌష్టికాహారాన్ని అందించిన వాళ్లవుతారన్నారు.

మెస్ చార్జీల విడుదలకు చొరవ చూపండి..

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ విద్యార్థుల మెస్ ఛార్జీలు విడుదలకు ఓయూ అధికారులు చొరవ చూపాలని ఏబీవీపీ నాయకులు రాజు గురువారం డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం మెస్ ఛార్జీలు మంజూరు చేయనందున విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ అధికారులు ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మెస్ ఛార్జీలను ఇప్పించాలని కోరారు.

చోరీ చేసి పట్టుబడ్డ దొంగలు



ల్యాప్‌టాప్ చూపుతున్న వికారాబాద్ పోలీసులు

సికింద్రాబాద్: రైలులో ప్రయాణిస్తున్న ఒక యువతి ల్యాప్‌టాప్‌ను దొంగిలించిన ఇద్దరు దొంగలను వికారాబాద్ రైల్వే పోలీసులకు పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ షేక్‌సలీమా కథనం ప్రకారం..గడ్డం ప్రియామనస్విని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పూణే నుంచి సికింద్రాబాద్ నగరానికి ముంబై–హైదరాబాద్ రైలులో బయలుదేరింది. బుధవారం రాత్రి రైలు వికారాబాద్ చేరుకున్న సమయంలో ప్రియామనస్విని నిద్రలోకి జారుకున్న సమయంలో అమె ల్యాప్‌టాప్ బ్యాగును దొంగతనం చేసిన ఇద్దరు రైలుదిగి పారిపోయే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన వికారాబాద్ రైల్వేపోలీసులు వెంబడించి పట్టకున్నారు. నిందితులు దొంగిలించిన ల్యాప్‌టాప్, రూ.15వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు కర్నాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (19) మరొకరు మైనారిటీ తీరని బాలుడిగా పోలీసులు గుర్తించారు.

నియామకం



సందీప్‌గౌడ్

లాలాపేట: బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా రుద్రగని సందీప్‌గౌడ్ నియమితులయ్యారు. సీతాఫల్‌మండికి చెందిన సందీప్‌గౌడ్ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ నుంచి నియామకపు పత్రాన్ని అందుకున్నట్లు సందీప్‌గౌడ్ తెలిపారు. యువకుల సమస్యల పై పోరాడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభానికి ఏబీవీపీ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఆలివేలి రాజు డిమాండ్ చేశారు. గురువారం రాజు ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజ్‌కుమార్‌ను కలిసి స్విమ్మింగ్‌పూల్‌ను మరమ్మతులు చేయించి 15 రోజుల్లో ప్రారంభించాలని కోరారు. త్వరితగతిన స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించకుంటే వీసీ భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వీసీ ప్రొ.రవీందర్ అనుమతితో స్విమ్మింగ్‌పూల్‌ను మరమ్మతులు చేయించి ప్రారంభించేందుకు కృషి చేయనున్నట్లు డైరెక్టర్ ప్రొ.రాజ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అవార్డు అందజేత

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిల విద్యాసంస్థ డైరెక్టర్ భాగ్యలక్ష్మీ వ్యాల్యూ ఎడ్యుకేషన్ ల్యాబ్ ఎంట్రప్రెనేర్ డైరెక్టర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందుకున్నారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఐకాన్ అవార్డ్స్–2024లో కైట్స్ క్రాఫ్ట్ ప్రొడక్షన్‌వారు అవార్డును అందజేశారు. తక్షశిల పాఠశాల విద్యార్థులను మంచి పౌరులుగానే కాకుండా దేశానికి బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇందుకు గానూ వచ్చే జూన్–జూలైలో రాబోయే సంవత్సరానికి వ్యాల్యూ ఎడ్యుకేషన్ ల్యాబ్‌కు ఎంట్రప్రెనేర్ డైరెక్టర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికయ్యారు. దేశ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్న భాగ్యలక్ష్మికి హెచ్‌ఆర్ భాను, ప్రిన్సిపాల్ తను ప్రీత్‌కౌర్, మహిపాల్‌రెడ్డి, హెచ్‌ఎం నాజమా అభినందించారు.

నైతిక విలువలను మర్చిపోవద్దు



వార్షిక వేడుకల్లో పాల్గొన్న సినీనటి అక్కినేని అమల

సనత్‌నగర్: బేగంపేటలోని శ్రీశక్తి కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీశక్తి కళాశాలల 30వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డైరెక్టర్ అమల అక్కినేని, సీఐఐ చైర్మన్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిప్రసాద్ హాజరై మాట్లాడారు. హోటల్ మేనేజ్‌మెంట్ రంగానికి అపూర్వ ఆదరణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయన్నారు. ఏ రంగంలో ఉన్నా నైతిక విలువలను మరిచిపోవద్దన్నారు. సమయపాలన, పనిలో నిబద్ధత, అంకితభావం ఉంటే విజయావకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. వృత్తి నైపుణ్యాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి గ్రూప్ చైర్మన్ డీవీ మనోహర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపింజల, విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు సీఎం హామీ

గుర్రం పవన్‌కుమార్‌గౌడ్



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సాధన సమితి సభ్యులు ఇటీవల సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలను కలిసి జిల్లా ఏర్పాటు కోసం మద్దతును కూడగట్టారు. ఎమ్మెల్యేల నుంచి సేకరించిన ఉత్తరాలను గురువారం సాధన సమితి సభ్యులు ముఖ్యమంత్రిని కలిసి అందించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఆవశ్యకతకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తామని సీఎం చెప్పినట్టు పవన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లష్కర్ ప్రత్యేక జిల్లా సాధన సమితి సభ్యులు సాదం బాల్‌రాజ్ యాదవ్, అశోక్, కృష్ణముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, జగ్గయ్య పాల్గొన్నారు.

రూ.11 లక్షలు స్వాధీనం



సికింద్రాబాద్: సరైన ఆధారాలు లేని నగదును జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఉప్పలపాడుకు చెందిన బానోతు నవీన్‌నాయక్ (25) పట్టుబడ్డాడు. బోయిన్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న నవీన్‌నాయక్ వద్ద రూ.11.08 లక్షలకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు కేసును బదిలీ చేశారు.

ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు ముగిశాయి. రెండు రోజులు జరిగిన పోటీలలో ఓయూ పరిధిలోని 167 కాలేజీలకు చెందిన 1150 మంది విద్యార్థులు పాల్గొని వివిధ కళారూపాలను ప్రదర్శించారు. పోటీలలో ఎంపిక చేయబడిన విద్యార్థులను అంతర్ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

'గాంధీ' డిప్యూటీలుగా శ్రీహరి, వినయ్‌శేఖర్



శ్రీహరి



వినయ్‌శేఖర్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌లుగా రేడియాలజీ, జనరల్ మెడిసన్ ప్రొఫెసర్లు శ్రీహరి, వినయ్‌శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌పై మంచి అనుభవం ఉందని భావించిన వైద్య ఉన్నతాధికారులు రేడియాలజీ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీహరి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్, ఏఆర్‌టీ సెంటర్ ఇన్‌చార్జి వినయ్‌శేఖర్‌కు డిప్యూటీ సూపరింటెండెంట్‌లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డిప్యూటీలుగా విధులు నిర్వహించిన డెర్మటాలజీ హెచ్‌ఓడీ నర్సింహారావునేత వ్యక్తిగత కారణాలతో డిప్యూటీ పదవికి రాజీనామా చేయగా మరో డిప్యూటీ ఈఎన్‌టీ హెచ్‌ఓడీ శోభన్‌బాబు లాంగ్‌లీవ్‌లో ఉన్నారు. ఆస్పత్రి పరిపాలన, నిర్ణయాలు తీసుకోవడంలో సూపరింటెండెంట్ రాజారావు తర్వాత డిప్యూటీ సూపరింటెండెంట్‌ల పాత్ర కీలకం. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి, నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తామని శ్రీహరి, వినయ్‌శేఖర్ తెలిపారు.

సన్మానం

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోట మణిమాల ఆధ్వర్యంలో ఆమెను కలిసి శాలువాతో సత్కరించారు. ఆమెతో పాటు సనత్‌నగర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ విజయ, మహిళా నాయకురాళ్లు సోఫియా, మమత, శుభ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు డిపాజిట్ దక్కదు



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల

కంటోన్మెంట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు డిపాజిట్‌లు కూడా దక్కవని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని మలానీ కాలనీ, రాయల్ ఎన్‌క్లేవ్ లాల్ బజార్, పార్క్‌వ్యూ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం అనంతరం తాడ్‌బండ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు డబ్బుతో ఓట్లు కొనగలుగుతామని పేదల పట్ల చులకన భావంతో ఉన్నాయన్నారు. మైనారిటీలు సైతం బీజేపీకి అనుకూలంగా ఓటు వేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఒకప్పుడు బీఆర్‌ఎస్ టికెట్ వస్తే గెలుస్తామన్న ధీమా నుంచి ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తే ఓడిపోతామన్న పరిస్థితి వచ్చిందన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ టీడీపీ నుంచి, సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో మంత్రులు అయినప్పుడు రేవంత్ రెడ్డి ఇలాంటి వారిని పిచ్చి కుక్కల్లా తరమాలన్నాడు. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేను సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నాడని అన్నారు. దళితుడే కాదన్న కడియం శ్రీహరి కుమార్తెకు ఎస్సీ కోటాలో సీటు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీగా కంటోన్మెంట్‌కు ఏం చేశాడో తెలపాలన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. త్వరలోనే కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సద కేశవరెడ్డి, భానుక నర్మద మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు నగరంలో స్థానం లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తన విజయం తథ్యమని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ కాలనీలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 64 ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్‌కు నగరంలో ఒక్క సీటు దక్కలేదన్నారు. ఐదేళ్లు కేంద్ర మంత్రిగా కొనసాగిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కూడా తన పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యేను గెలిపించుకోలేకపోయారని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తాను రాష్ట్ర మంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి సికింద్రాబాద్ శాసనసభ పరిధిలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో రేకుల షెడ్లు మినహా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. రెండు జాతీయ పార్టీల పనితీరు పట్ల నగర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రెండు జాతీయ పార్టీల అభ్యర్థులపై సికింద్రాబాద్ ఎంపీగా తన గెలుపు నల్లేరుమీద నడక లాంటిదని పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ప్రచారాలు విస్తృతం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్‌షోను నిర్వహించనున్నామని పద్మారావుగౌడ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, ఐదు డివిజన్లకు చెందిన ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పట్నం సునీతా మహేందర్ రెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు శ్రీగణేశ్, మర్రి అమరేందర్‌రెడ్డితో కలిసి ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన టీపీటీ బకాయిల్లో రూ.48 కోట్లు విడుదల చేసిందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ కారిడార్‌లకు స్థల కేటాయింపు సమస్యను పరిష్కరించి, ఏకంగా పనులకు శంకుస్థాపన కూడా చేసిందని తద్వారా కంటోన్మెంట్ పరిధిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించనుందన్నారు. ఇక కంటోన్మెంట్ పరిధిలోని పలు బస్తీలకు సంబంధించి భూబదలాయింపు సమస్యకు కూడా త్వరలో తగిన పరిష్కారం లభిస్తుందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే ఈ అంశాన్ని తొలి ప్రాధాన్యతగా పరిష్కరిస్తానని అన్నారు. శ్రీగణేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతో పేదల ఆదరణ చూరగొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం బలవంత్ రెడ్డి, శామ్యూల్, సదానంద్, సంజీవ, శరత్, నాగిరెడ్డి పాల్గొన్నారు.